క్లుప్తంగా

కార్మెల్‌మాతకు భక్తులు పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై కొలువై ఉన్న కార్మెల్‌మాతను దర్శించుకునేందుకు ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉదయాన్నే పొద్దుటూరు, ఆళ్లగడ్డ, మార్కాపురం, నంద్యాల ప్రాంతాల నుంచి వచ్చారు. భక్తులు కొండదిగువన ఉన్న బాల ఏసుదేవాలయంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని కొండ ఎక్కారు. తలనీలాలు సమర్పించి కార్మెల్ మాతను దర్శించుకొని కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు.

నేడు విద్యుత్ సరఫరానిలిపివేత

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా దుగ్గిరాల మండల పరిధిలో సోమవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఎస్.సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 వరకు కోత ఉంటుందని చెప్పారు. దుగ్గిరాల, పెనుమూలి, చింతలపూడి, మోరంపూడి గ్రామాల్లో గృహ, వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులకు సహకరించాలని కోరారు.

ఘనంగా పాస్టర్స్ డే



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్స్‌డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు, సంఘ కమిటీ సభ్యులు మాట్లాడుతూ తెలుగు బాప్టిస్ట్ చర్చినందు తన సేవలను అందిస్తున్న రవికుమార్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అనంతరం సంఘ కాపరి కేకే రవికుమార్‌ను ఘనంగా సత్కరించారు.

చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



తాడేపల్లిరూరల్: ఓ యువకుడు అకాల మరణం చెందడంతో అతడితో పాటు కలసి చదువుకున్న స్నేహితులు ఆదివారం ఆ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పెనుమాకలో నివాసముండే షేక్ ఖాసిం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ కుటుంబానికి అతడి చిన్ననాటి స్నేహితులు ఆదుకోవాలనే ఉద్దేశంతో మృతుడి తల్లికి ఆ సహాయాన్ని అందజేశారు. పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ పాఠశాలలో షేక్ ఖాసింతో కలసి 10వ తరగతి వరకు చదువుకున్న తోటి స్నేహితులందరూ రూ.65 వేలు సాయం అందించారు.

కవి ప్రజ్ఞాచారికి సన్మానం

తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరుకు చెందిన కవి నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి ఆదివారం నరసరావుపేటలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. సాహితీ సేవా శీర్షికతో పద్య పఠనం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పూర్ణ ప్రజ్ఞాచారిని శాలువా, పూలమాలతో సత్కరించి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో కళావేదిక చైర్మన్ కత్తి మండ ప్రతాప్, రమావతి, పల్నాడు శాఖ అధ్యక్షురాలు రమాబాయి, కార్యదర్శి గుండాల రాకేష్, కళావేదిక సభ్యులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

తెనాలి రూరల్: రైలు ఢీకొని ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ పినపాడుకు చెందిన ఆటో డ్రైవర్ షేక్ నాగూరా(33)ను మల్లెపాడు గేటు వద్ద గూడ్స్ రైలు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడ్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించగా, శనివారం రాత్రి మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు ఆదివారం తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరులో సింధూ గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ చౌటూరా లక్ష్మీ, రవీంద్రబాబుకు చెందిన మినుము పంట పొలంలో అగ్ని అస్త్రం, చే బెల్లం ద్రావణం తయారు చేసే విధానాన్ని తెనాలికి చెందిన ప్రకృతి వ్యవసాయ నిపుణురాలు మౌనిక వివరించారు. అదే విధంగా గ్రామానికి చెందిన బొజ్జా రాఘవులు పసుపు పంట పొలంలో లంబాడీ తెగులు నివారణకు పేడ మూత్రం, ఇంగువ ద్రావణం, పుల్లటి మజ్జిగ స్ప్రే చేయించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌టీ–1 శివ నాగేశ్వరమ్మ, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

రేపు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కృత్రిమ చేతులు పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న ఇసునూరి అనిల్ చక్రవర్తి

మంగళగిరి: దివ్యాంగులకు ఎల్ఎన్ 4 కృత్రిమ చేతులను మంగళవారం పంపిణీ చేయనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ప్రెసిడెంట్ అందె రేవంత్ తెలిపారు. నగరంలోని ఎయిమ్స్ పక్కన ఉన్న ఏకో పార్కులో ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రేవంత్ మాట్లాడుతూ ఒక్కొక్క కృత్రిమ చేయి రూ.36 వేల విలువతో 500 మందికి రూ.1.80 కోట్ల విలువైన కృత్రిమ చేతులను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు చైర్మన్ ఇసునూరి అనిల్ చక్రవర్తి మాట్లాడూతూ కృత్రిమ చేతుల ఉచిత పంపిణీ ప్రాజెక్టు ప్రచారంలో భాగంగా వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నేచర్ వాకర్స్ అసోసియేషన్ భాగస్వామ్యంతో ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. మంగళకరము పేరిట నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఈ నెల 10వ తేదీన గౌతమబుద్ధారోడ్డులోని రాయల్ కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ప్రమోషన్, ప్రచారం కొరకు సోషల్ మీడియాని వినియోగించుకుని దివ్యాంగులకు సమాచారం అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, డైరెక్టర్లు నూతలపాటి వెంకటేశ్వరరావు, అందె మురళీ మోహన్, కాపరౌతు సుందరయ్య, లంకా శివపామ్‌ప్రసాద్, భాష్యం రంగనాథ్, జొన్నాదుల భిక్షారావు, వాకర్స్ అసోషియేషన్ ప్రతినిధులు పుప్పాల కోటేశ్వరరావు, వీసం వెంకటేశ్వరరావు, మంచా విజయమోహన్, బట్టు వెంకటేశ్వరరావు, జంజనం రామకృష్ణ, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, ఫారెస్ట్ డెప్యూటీ రేంజర్ గిరిబాబు పాల్గొన్నారు.

ర్యాంప్ ప్రారంభం



ర్యాంప్‌ను ప్రారంభిస్తున్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ గోకరాజు గంగరాజు

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ఉన్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంగణంలో ర్యాంప్‌ను ఆదివారం అసోసియేషన్ చైర్మన్ గోకరాజు గంగరాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ ర్యాంప్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయించిన జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, విద్యుత్, సైన్స్ అండ్ టెక్నాలజీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరావు ధన్యవాదాలు తెలిపారు. ఈ ర్యాంప్ నిర్మాణం వల్ల అసోసియేషన్ ప్రాంగణంలోకి వాహనాల రాకపోకలకు, స్థానికంగా నివాసముంటున్న వారికి సౌకర్యంగా ఉంటుందని అన్నారు. ఈ ర్యాంప్ నిర్మాణానికి కృషి చేసిన అసోసియేషన్ సభ్యులు ఆకుల శ్రీనివాస్ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వెలగపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు లింగిపల్లి రామకృష్ణ, కార్యదర్శి ఎం.నరసరాజు పాల్గొన్నారు.

ఆంధ్రులకు కేంద్రం అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహనరావు, పక్కన శరత్‌చంద్ర

తెనాలి రూరల్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హామీల అమలుపై గత తొమ్మిదేళ్లుగా అన్యాయం చేస్తోందని, ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు న్యాయం చేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు డిమాండ్ చేశారు. తెనాలిలో ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆయన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శరత్‌చంద్రతో కలసి ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత తొమ్మిదేళ్లుగా కడప ఉక్కు కర్మాగారం ఊసే లేదని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం డీసీఆర్ ఆమోదించి ఆర్థిక అంచనాలు పెంచే విషయంలో కూడా మీనమేషాలు లెక్కబెడుతోందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు వస్తున్నందున అక్కడ ఓటర్లపై కపట ప్రేమ చూపిస్తూ గిరిజన విశ్వవిద్యాలయం, పసుపు బోర్డు మంజూరు చేస్తూ ఓటు బ్యాంకును కొల్లగొట్టే ఆలోచన చేస్తోందని రామ్మోహనరావు ఆరోపించారు. చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించాలనే మూడు దశాబ్దాల చిరకాల వాంఛ నెరవేర్చినట్లు పైకి కనిపిస్తూనే ఉన్నా అవి అమలు కావాలంటే మరో రెండు దశాబ్దాలు పట్టేటట్లు ఉందన్నారు. మహిళా రిజర్వేషన్లు బిల్లు చట్టంలో పదజాలంలో మెలికలు తిప్పి చట్టాన్ని ఆమోదించడం చూస్తే మహిళా లోకానికి అరచేతిలో స్వర్గం చూపిస్తోందని విమర్శించారు. రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్ సవరించి రాజకీయ పార్టీలే మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించడానికి అవసరమైన చిన్న మార్పు చేస్తే సరిపోతుందని ఆయన సూచించారు. ఇప్పటికైనా వచ్చే పార్లమెంటు ఎన్నికలలోగా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హామీలు అన్నిటిని తీర్చే విధంగా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని రామ్మోహనరావు కోరారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

పారిశుద్ధ్య రంగంలోని వారికీ అవకాశం

తెనాలి: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు, పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్ కుమార్ సూచించారు. స్థానిక గంగానమ్మపేటలోని గోపాలరెడ్డి వీధిలో హెచ్‌డబ్ల్యూఎస్ శిక్షణ కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా జాతీయ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇక్కడ ఇస్తారని తెలిపారు. బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ, టైలరింగ్, కంప్యూటర్ కోర్సులు, ఫిట్టర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, డ్రైవింగ్ కోర్సుల్లోనూ శిక్షణ ఉంటుందన్నారు. పునశ్చరణ పథకం ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ రంగాల్లో పని చేసే కార్మికులకు కేంద్ర ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ పథకం ద్వారా వృత్తి నైపుణ్య శిక్షణనిచ్చి, సర్టిఫికెట్ ఇస్తామని ఉపాధ్యక్షుడు, సంస్థ డైరెక్టర్ బుస్సా బాబూరావు చెప్పారు. మెరుగైన ఉద్యోగం కోసం ఈ సర్టిఫికెట్ ఉపకరిస్తుందని తెలియజేశారు. శిక్షణలో ఉత్తీర్ణులైనవారికి రూ.500 బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని, మూడేళ్ల కాలపరిమితి గల రూ.2 లక్షల ప్రమాద బీమా ఇస్తారని తెలిపారు. రిఫ్లెక్టర్ జాకెట్, ముద్ర పథకం ద్వారా బ్యాంకు రుణాలను పొందే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు కనపర్తి అనిల్, ఐక్యవేదిక అధికార ప్రతినిధి నలగండ్ల రవిచంద్ర, మధిర రవీంద్రబాబు, ఉప్పల సునీల్‌కుమార్, వల్లటూరి రాధా, నీలం ప్రసాద్, బుస్సా సందీప్, బుస్సా మనోహర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వాగ్గేయకార సంగీత మహోత్సవం



సంగీత కచేరీ చేస్తున్న మోదుకూరి సుధాకర్ బృందం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కల్యాణ మండపం వేదికగా గాయత్రి మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో వాగ్గేయకార సంగీత మహోత్సవాన్ని ఆదివారం డాక్టర్ పద్మావతి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి యం.వై. శేషురాణి ఆధ్వర్యంలో ఉదయం గుంటూరుకు చెందిన రాచకొండ ఫణితేజ వేణుగానం, యాయవరం రాజ్యలక్ష్మి గాత్ర కచేరి సంగీతాభిమానుల్ని ఆకట్టుకున్నాయి. వీరికి వయోలిన్‌పై పి.ఎల్. జయతి, మృదంగంపై సీహెచ్. సూర్య వాయిద్య సహకారాన్ని అందించారు. సాయంత్రం అన్నమయ్య కళావేదికగా ప్రధాన కచేరీలో విజయవాడకు చెందిన విద్వాన్ మోదుమూడి సుధాకర్ శాస్త్రీయ సంగీత కచేరీ శ్రావ్యంగా సాగింది. కార్యక్రమంలో అతిథులుగా పులికొండ శ్రీవల్లి, పులికొండ పిచ్చయ్య, డాక్టర్ బి.రాజేష్ పాల్గొన్నారు. కళాకారులు, అతిథుల్ని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పి.విజయ, ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, పాటిబండ్ల లలితాదేవి, కోశాధికారి ఎం.విజయలక్ష్మి, కార్యదర్శి ఏ. మంగాదేవి, మాధవీకృష్ణ ఘనంగా సత్కరించారు.

టీటీడీ కల్యాణ మండపం స్థల పరిశీలన

పెదకూరపాడు: తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ.2 కోట్లతో మండలంలోని 75 త్యాళ్ళూరులో నిర్మించనున్న టీటీడీ కల్యాణ మండపం స్థలాన్ని నర్సరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం సందర్శించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు కేటాయించిన టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మండపం నిర్మాణానికి తమవంతు సాయంగా గ్రామస్తులు గుత్తికొండ ఆంజిరెడ్డి ఆధ్వర్యంలో గుత్తికొండ రామకృష్ణారెడ్డి రూ.11,75వేలు, గుత్తికొండ తిరుపతిరెడ్డి రూ.8.25లక్షలు, జోన్నల వెంకటరెడ్డి రూ.8 లక్షలు, గుత్తికొండ అప్పిరెడ్డి రూ.2 లక్షలు, అరబిందో ఫార్మా కంపెనీకి చెందిన నిత్యానందరెడ్డి రూ.10లక్షలు, మండపం నిర్మాణానికి అవసరమైన ఎకరం స్థలం కేటాయించారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. అందుకు సంబంధించిన చెక్కులను, స్థలం పత్రాలను ఎంపీ, ఎమ్మెల్యేకు గుత్తికొండ ఆంజిరెడ్డి అందించారు. కల్యాణ మండపం నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసేలా కృషి చేస్తామని ఎంపీ, ఎమ్మెల్యేలు అన్నారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మాజీ చైర్మన్ జాలయ్య, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ మండల కన్వీనర్లు, పార్టీ ముఖ్య నేతలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ హనుమంతరావుకు సన్మానం



ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావును సన్మానిస్తున్న సంఘ పెద్దలు

మంగళగిరి: శాసన మండలి ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా ఎంపికై న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావును ఘనంగా సత్కరించారు. ఆదివారం పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో హనుమంతరావు నివాసంలో సంఘ పెద్దలు హనుమంతరావును దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు దామర్ల కుబేరస్వామి, చింతక్రింది కనకయ్య, గంజి రవీంద్రనాథ్, రామనాథం పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

కొల్లూరు: ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు కొల్లూరు పోలీసులు ఆదివారం తెలిపారు. కొల్లూరుకు చెందిన కొమ్ము శ్రీనివాసరావు, ఆకుకూరల వ్యాపారి గొడవర్తి సామ్రాజ్యం మధ్య ఇటీవల మనస్పర్ధలు రావడంతో తరచూ వివాదం జరుగుతుండేది. కొల్లూరు లూథరన్ చర్చి సమీపంలో కూర్చుని ఉన్న శ్రీనివాసరావును గమనించిన సామ్రాజ్యం శుక్రవారం భర్త సీతయ్య, కుమారుడు భాస్కరరావుతో కలసి గొడవకు దిగింది. ఈ సమయంలో వివాదం పెద్దదవడంతో శ్రీనివాసరావుపై ముగ్గురు దాడి చేశారు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. తెనాలి వైద్యశాలలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ అర్జున్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి తెలిపారు.

యువకుల మధ్య వివాదం

పట్నంబజారు: ఇద్దరు యువకుల మధ్య యువతి విషయంలో ఏర్పడిన వివాదం ఘర్షణకు దారి తీసింది. విశ్వసనీయ సమాచారం మేరకు. యువతి విషయంలో ఇద్దరు యువకులు రెండు వర్గాలుగా ఏర్పడి మాయబజార్ సెంటర్‌లో కొట్టుకునే ప్రయత్నం చేశారు. స్థానికులు వారించి పంపడంతో అక్కడ నుంచి బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్దకు ఘర్షణ పడేందుకు వెళ్లారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న పాత గుంటూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకోవడంతో అక్కడి నుంచి పరారయ్యారు. అయితే, కొంతమంది యువకుల్ని గుర్తించిన పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

కుల దూషణపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: అత్తను కోడలు, ఆమె బంధువులు కొట్టి కులం పేరుతో దూషించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టాభిపురానికి చెందిన మల్లాపురం ప్రమీలాదేవి కుమారుడు కార్తిక్, సాహితీ ప్రియాంకను కులాంతర వివాహం చేసుకుని కుటుంబ సభ్యులకు దూరంగా నివసిస్తున్నాడు. ఆస్తుల విషయమై సాహితీ ప్రియాంకకు, అత్త ప్రమీలాదేవికి గొడవలు చోటుచేకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 3న ప్రియాంక తల్లిదండ్రులు, బంధువుల్ని వెంటబెట్టుకుని రవీంద్రనగర్‌లోని అత్త ప్రమీలాదేవి ఇంటికి వెళ్లింది. ఆమెను కులం పేరుతో దూషించి కొట్టారు. ఈ మేరకు ప్రమీలాదేవి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

గుంటూరు ఈస్ట్: ఆగంతకుడు మహిళ మెడలోని బంగారు గొలుసు తెంచుకుని పారిపోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. రెడ్డిపాలేనికి చెందిన మద్దు మాలిని గుంటూరు బ్రాడీపేట మెయిన్ రోడ్డులో నడిచి వెళుతోంది. ఈ సమయంలో ఓ ఆగంతకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని 2.5 సవర్ల బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యాడు. మాలిని ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

పేకాట ఆడుతున్న నలుగురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. బ్రాడీపేట 1/10లో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.1650 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిథిలమైన వాటర్ ట్యాంకులు పునరుద్ధరించాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకుల్ని పునరుద్ధరించాలని ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి నగరపాలక సంస్థ అధికారుల్ని కోరారు. ఆదివారం దేవాపురంలో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ స్టేడియం, నెహ్రూనగర్, ఏటీ అగ్రహారం, స్తంభాలగరుడ, గుజ్జనగుండ్ల, శారదాకాలనీ తదితర ప్రాంతాల్లో వాటర్ ట్యాంకులు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా నిధులు కేటాయించి వాటిని పునరుద్ధరించాలని విన్నవించారు. మిగిలిన ప్రాంతాల్లో విన్నవించగానే ట్యాంకుల్ని శుభ్రపరిచినందుకు గాను రేట్ పేయర్స్ అసోసియేషన్ తరఫున కమిషనర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు వరదరామయ్య, ట్రెజరర్ సాయిరామ్, వల్లూరి సదాశివరావు, అంజిరెడ్డి, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

కైలాసగిరి కొండపై రోడ్డు ప్రమాదం

ప్రమాదంలో 13 మందికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో



ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు



గాయపడిన చిన్నారి

మేడికొండూరు: కైలాసగిరి కొండపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... గుంటూరు మిర్చి యార్డుకు చెందిన కొందరు కూలీలు వివాహ కార్యక్రమానికి గుంటూరు నుంచి ఆటోలో కై లాసగిరి కొండకు ఆదివారం ఉదయం బయలు దేరారు. మధ్యాహ్న సమయంలో వివాహ అనంతరం కైలాసగిరి కొండ నుంచి తిరిగి ఆటోలో వస్తుండగా ఆటో అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న పెద్ద కొండ రాయిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 13 మందికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన వారందరినీ 108లో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కైలాసగిరి రోడ్డు ప్రమాదంలో గాయపడిన 13 మంది ఢిల్లీకు చెందిన వారని పోలీసుల చెప్పారు. వీరంతా కూలీ పని నిమిత్తం గుంటూరు మిర్చియార్డులో రోజు వారీ కూలీలుగా పనిచేసేందుకు వచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు. గాయపడిన వారి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ వాసు తెలిపారు.

పేద చేనేత విద్యార్థులకు సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న పద్మశాలీయ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి: పద్మశాలీయ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద చేనేత విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం పట్టణంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీ ఫార్మసీ విద్యార్థి కోదాటి ఈశ్వర్ కుమార్‌కి రూ.15 వేలు, బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థి తుమ్మ బాలాజికి రూ.10 వేలు అందజేశారు. ఇద్దరు విద్యార్థుల కుటుంబాలు పేదరికంతో ఉన్నత చదువులు అభ్యసించేందుకు ఇబ్బందులు పడుతుండడంతో అసోసియేషన్ ఆధ్వర్యంలో దాతలు అందజేసిన మొత్తాన్ని అందజేసినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు పేద చేనేత విద్యార్థులకు గత 13 సంవత్సరాలుగా రూ.3 కోట్లు ఆర్థిక సహాయం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు అవ్వారు సత్యకృపాల్ డాంగే, బట్టు నారాయణరావు, గంజి రవీంద్రనాథ్, గోలి కస్తూరి పాల్గొన్నారు.

15 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేట దేవీచౌక్‌లో గల శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 92వ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభించనున్నారు. శ్రీరాజరాజేశ్వరి సేవాసంఘం అధ్యక్షుడు టీవీఎస్ శాస్త్రి, అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు చివుకుల శివప్రసాద్ ఆదివారం విలేకరుల సమావేశంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. వివరాలను వెల్లడించారు. ఈనెల 25వ తేదీవరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలి రోజైన 15వ తేదీ ఉదయం ఏడు గంటలకు ఉత్సవ ఆరంభ కలశ స్థాపన జరుగుతుందని తెలిపారు. తదుపరి ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటలకు బాలపూజ, మధ్యాహ్నం 12 గంటల్నుంచి శ్రీచక్రార్చన, రాత్రి ఏడు గంటలకు తీర్థప్రసాద వినియోగం, అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. వందేళ్ల చరిత్ర కలిగిన దేవస్థానంలో జరిగే ఉత్సవాలకు భక్తులందరూ వచ్చి అన్నప్రసాదం స్వీకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సేవా సంఘం కార్యదర్శి వి.రత్నాకరశాస్త్రి, ఉపాధ్యక్షుడు చివుకుల శివరాంప్రసాద్, కోశాధికారి ధార బాలకృష్ణ, సభ్యులు పోలేపెద్ది రామకృష్ణ, పొత్తూరు కోదండరామమూర్తి, కొండపి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైమానిక వీరులకు అండగా నిలవాలి

కల్నల్ కె.ఎం.రావు



సభలో మాట్లాడుతున్న కేఎం రావు

పొన్నూరు: దేశ రక్షణ రంగంలో అహర్నిశలు శ్రమిస్తున్న వైమానిక వీరులకు పౌరులందరూ అండగా నిలవాలని కల్నల్ కేఎం రావు అన్నారు. పొన్నూరులోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం షాదీఖానాలో ఆదివారం మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారత వైమానిక దళ దినోత్సవం నిర్వహించారు. సభకు మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కెప్టెన్ హాజీ షేక్ మస్తాన్ సాహెబ్ అధ్యక్షత వహించారు. సభలో కల్నల్ మాట్లాడుతూ దేశ రక్షణలో వైమానిక రంగంలో పనిచేస్తూ అసువులు బాసిన సైనిక కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఎంఏ మహమ్మద్, ఏఎంసీ డైరెక్టర్ షేక్ అక్బర్ వలి, కెప్టెన్ సుభాని, మేజర్ హనుమంతురావు , జేఎస్ లియాఖత్ అలీ, జేఎస్ శర్మ, మహమ్మద్ జాను, అక్బర్ వలి, మీరావలి పాల్గొన్నారు.

బోధనలో మెలకువలు పాటించాలి



స్వామి సువేరానందతో పాఠశాల యాజమాన్యం

ఆచార్య స్వామి సువేరానంద

నెహ్రూనగర్: ఉపాధ్యాయులు మెలకువలు అనుసరిస్తూ విద్యార్థులకు బోధన చేయాలని చిన్మయ మిషన్ చెందిన ఆచార్య స్వామి సువేరానంద తెలియజేశారు. లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూలులో ఆదివారం లైఫ్ యాన్ ఆరాధన అనే ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువును మూల్యాంకనం ఆధారంగా కాకుండా అవగాహన ఆధారంగా, ఆదర్శప్రాయంగా ఉండేలా బోధించాలని సూచించారు. ప్రశ్న, జవాబులా కాకుండా ప్రకృతితో మమేకమై విద్యార్థి స్వేచ్ఛగా చదువుకోవాలని తెలిపారు. జీవితం, సమాజం, విద్య, ఉద్యోగం, సంపాదన, ప్రవర్తన, భారతీయ తత్వం ఇలా అన్ని రంగాల్లో విద్యార్థులకు పరిపూర్ణమైన జ్ఞానాన్ని అందించేలా బోధన ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల గౌరవాధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు యలమంచిలి శివాజీ, సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, కమిటీ మెంబర్స్ గింజుపల్లి వరప్రసాదరావు, వీవీఐటీ జాయింట్ సెక్రటరీ శ్రీకృష్ణ, వీవా స్కూల్ అకడమిక్ డైరెక్టర్ కె.ఎస్.రావు, డాక్టర్ నరేంద్రనాథ్ పాల్గొన్నారు.